
# మునగచెట్టు



వడ్డించిన విస్తరిముందు కూర్చున్నాడు మేఘవర్ణం!

ఒకప్పుడు మేఘవర్ణం జీవితమే వడ్డించిన విస్తరి. ఇప్పుడు మేఘవర్ణం వడ్డించిన విస్తరి మొగం కాదు– ముద్దసంకటి మొగంచూసి మూన్నాళ్లయింది.

ఎర్రని ఎండలో భర్త. అతనితో కలిసి ఇంట్లో అడుగు పెట్టిన మేఘవర్ణం. కండ్లుదీగూళ్లు. ఆ దీగూడులాంటి కండ్లల్లో కొడికదుతున్న దీపాల్లా ప్రాణం. వెన్నెముకను వెతుక్కొంటూ వెనక్కి వెనక్కి పోతున్న కదుపు. మేఘవర్ణాన్ని గమనించింది రత్నమ్మ– రంగనాథం భార్య. 'అయ్యోపాపం!' అని నిట్టూర్చింది. నిట్టూర్పులతో ఊరడింపులతో కడుపులు నిండవని ఎరిగిన ఇల్లాలు! కదుపుచూసి అన్నం పెట్టగల తల్లి. విస్తరినిండుకు వడ్డించింది.

ఆ విస్తరిముందు మేఘవర్ణం! కాదు అస్థి పంజరం ముందు అన్నం వడ్డించిన విస్తరి! గిన్నెలో సాంబారు. గరిటినిండుకు తీసింది. వడ్డించిన అన్నం మీద పోసింది. అది మునక్కాయ సాంబారు!

సాంబారుతో కలిసి నాలుగైదు మునక్కాయ ముక్కలు. అవి అన్నంమీద పడ్డాయోలేదో?

ఆకాశంలో ముసురుకొన్న మబ్బులు క్షణక్షణానికి రంగులు మార్చినట్లు మేఘవర్ణం ముఖ కవళికలు మారుతున్నాయి. చూపులు ఒక్కసారిగా తీక్షణమయ్యాయి. ఆ చూపులు అటు యిటు కదలకుండా మునక్కాయ ముక్కల మీదే నిలిచాయి. ఎంతసేపు? ఒక మునక్కాయ ముక్క నమిలినంతసేపు!

చూస్తూ చూస్తూ ఉండగానే అతని కండ్లు నిండుకొన్నాయి.

వంచిన తలెత్తకుండా వలవలా ఏడుస్తున్నాడు.

వడ్డించిన విస్తరిముందునుండి చివుక్కున పైకిలేచాడు. లేచినవాడు లేచినట్లుగానే ఒక్క ఊపులో వీధిన పడ్డాడు.

నోటమాట రాకుండా రంగనాథంరత్నమ్మ ఒకరిమొగం ఒకరుచూసుకొంటూ అలానే నిలబడ్డారు!....

రాయలసీమలో రాళ్లు పగులుతాయేమో? అన్నట్టుగా కాస్తూ ఉంది ఎండ. ఆ ఎండలో రంగనాథం మడిదగ్గరి నుండి ఇంటికి వస్తున్నాడు.

ఊరి ముందర మేఘవర్ణం ఎదురుపడ్డాడు.

ఎదురుపడ్డ మేఘవర్ణాన్ని ఎగిదిగా చూశాడు రంగనాథం.

నడకలో నీరసం... చూపుల్లో అభిమానం... వాడిన తోటకూర కాడకుమల్లే ఆకారం. నడవలేక నడుస్తున్న మేఘవర్ణాన్ని చూసేసరికి రంగనాథం కడుపులో చెయ్యేసి దేవినట్లయింది.

అయిదుపదులు వయస్సుపైబడిన రంగనాథం. సాఫీగా ఆ జీవితాన్ని ముందుకులాక్కొని రావడానికి ఎంత యాతన పడ్డాడో ఏమోకానీ ముప్పై సంవత్సరాల వెనక్కి వెళ్ళడానికి ఒకే ఒక్క నిముషం పట్టలేదు.

కోదండరామయ్య ముద్దుల కొడుకేనా ఈ మేఘవర్ణం? కురుకురు మీసం వస్తున్న ప్రాయాన పంతానికిదిగి నలుగురుపట్టి కదిలించినా కదలని బండరాయి. పట్టుకోవడానికి వాటములేదు. వొడుపూ దొరకదు. అటువంటి రాతిని అమాంతంగా భుజానికెత్తుకొని ఊరొకచుట్టేసిన మనిషేనా మేఘవర్ణం?

ఈ దుస్థితికి కారణం? వయసు పైబడడమేనా? కాదు.

రంగనాథం గుండె అట్టడుగు పొరల్ని చీల్చుకొని వెడలిన సానుభూతి!...

అడుగుముందుకు పడనివ్వలేదు. మేఘవర్ణాన్ని ముందుకు వెళ్లనివ్వలేదు. పట్టి బలవంతాన ఇంటికి పిలుచుకొని వచ్చాడు. రెక్కపట్టి విస్తరిముందు కూర్చోపెట్టాడు.

కూర్చోపెడితే ఏమయింది?

వడ్డించిన విస్తరిముందు కూర్చున్న మనిషి కూర్చున్నట్లుగా లేచి వెళ్ళిపోయాడు!

పండి పగిలిన జిల్లేడుకాయలోని విత్తనాలు గాలికి ఎగురుతున్నట్లుగా రంగనాథం తలలో ఆలోచనలు!

వీధిలో చెత్తాచెదారాన్ని చిదుగుతూ తిరుగుతున్న పిల్లలకోడికి గద్దనీడ కంట పడిందేమో?

కొంప మునిగినట్లు కొక్కరిస్తూ కొట్టంలోకి పరుగెత్తుతూ ఉంది. దాని వెంటపడి పిల్లలు ఉధృతమైన గాలికి కొట్టుకొని వస్తున్న దూది ఉండల్లా కొట్టంలో దిక్కు కొకటిగా పరుగెత్తు తున్నాయి. గూటాన ఆవుదూడ 'అంబా' అని అరుస్తూ ఉంది.

"అది గాదయ్యా! కాశికో రామేశ్వరానికో పొయ్యొచ్చినవాళ్ళుండారే ఏదో ఒక కాయను వదిలేస్తారంట. రోగంవో రొస్టో వచ్చినవాళ్లు డాక్టర్లు ఫలాన కాయపడదనిచెప్తే ఆ కాయను వదిలేస్తారంట. మేఘవర్ణం కాశికి పోలేదు. కాయలా పల్లేదు. మరి మునక్కాయ కంటపడతానే కంట తడిబెట్టెనే? ఎందుకయ్యా?"

రత్నమ్మ తన సందేహాన్ని వెలిబుచ్చింది.

"అదేగదా నేనూ ఆలోచిస్తా ఉండేది."

"ఆలోచించి ఇంక చెయ్యగలిగింది మాత్రం ఏంవుండాది కానీ– లెయ్యండి పొద్దు తిరిగి పోతా ఉండాది."

"పాపం! ఎన్నాళ్ళయిందో తిండిమొగం చూసి. ఆ కండ్లల్లో పాణం చూసే కుందికి కడుపు రగిలె. ఈ ఒక్కపూటైనా కడుపునిండా అంత అన్నం పెడదాంవనుకుంటే? అన్నం ముందు కూర్చున్న మనిషి అనుకోనట్లుగా లేచిపోతే? ఆకలే చచ్చిపాయగదే? ఇంక నన్నెట్టా తినమంటావే?"

"అన్నం పెట్టాలనే గదా పిలుచుకోనొచ్చింది. కడుపునిండా తినమనేగదా నేనూ వడ్డించింది. మాటాపలుకులేకుండా ఆ మనిషి లేచిపోతే?"

"హుం! మూన్నాళ్లు కాదు. ముప్పైనాళ్ళయినా పస్తులైనా పడిచస్తాడు కానీ మేఘవర్ణం ఒకరి ముందు చేయిచాపే మనిషికాదే. పోనీ! అది అహం అనుకుందాంవంటే? కాదే? అభిమానం. అభిమానం చంపుకోలేనోళ్లు ఈకాలంలో ఇద్దో యిట్లా చావలేక బతకాల్సిందే!"

"అటువంటి మనిషి పిలిస్తే రాకుండానే ఉండాలా. వచ్చి......"

"అదే గదా నా బాధకూడా!"

"మన తప్పుంటే మనం బాధపడాల్సిందే! లేనపుడేం జెయ్యాల? ఇదంతా మణుసులో పెట్టుకుంటే అదయ్యేపని కాదుకానీ మీరు లెయ్యండి. ఇప్పటికే వేళ తప్పింది. అంత తినండి. పనీపాటా ఉంటే ఆ మిందట చూసుకుందురుకానీ..."

అయిష్టంగానే ఆకుముందర కూర్చున్నాడు రంగనాథం.

మొక్కుబడిగా నాలుగు మెతుకులు కెలికాడు. పైకిలేచాడు. కుడితొట్టి దగ్గరికి నడిచాడు. పరధ్యానంగా ఆ తొట్టిలో చెయ్యికడుక్కొంటున్నాడు.

గూటాన అవుదూడ గమనించింది. అంబా! అంబా! అని అరిచింది.

ఉలిక్కి పడ్డాడు.

"అయ్యయ్యో! ఈ గొడవలో పడి లేగదూడ సంగతే మరిచిపోతినే? దాని కన్ని నీళ్ల చూపు. నాలుగు కసువు పోసలు దాని ముందర విదిలించు. ఈ కరెంటు ఎప్పుడొస్తుందో? ఎప్పుడు పోతుందో? ఈ సమయంలో తాచ్చారం చేస్తే చేతికందిన పైరు నోటికందదు. నేను మడితావుకు పోతాఉండా."

కడిగినచేతి తడిఆరలేదు. కాలుకదపక తప్పలేదు.

రంగనాథం రాయలసీమలో రైతు.

ఆ ఊళ్లో ఒక్క లెక్కకెక్కిన మనిషి రంగనాథం. అతని మంచితనం అటువంటిది. మన్నన అటువంటిది. కష్టం అంటే చేయి అందిస్తాడు. కన్నీళ్లు చూస్తే ఆ చేతితోనే తుడస్తాడు. అందుకే మేఘవర్ణం ప్రవర్తన రంగనాథాన్ని కదిపేస్తూ ఉంది.

కడిగితోసినట్లున్న ఆకాశంలో సూర్యుడు దుందుడుకులు పడుతున్నాడు. మాడుమాడి పోతుంటే రంగనాథం భుజం మీది తుండుగుడ్డను తీసి తలమీద వేసుకొన్నాడు. ఆ క్షణంలో కరెంటువస్తే? తాను మడిదగ్గరికి చేరుకోవడానికి పట్టే సమయంలో వచ్చిన కరెంటు వృధా అయిపోతే? పైరుకు తడిపడదు. తడిపడకపోతే? పైరు ఎండిపోతుంది. పైరు ఎండిపోతే బతుకులే ఎండిపోతాయి. అది రైతు తపన! ఆ తపనతోనే రంగనాథం నడుస్తున్నాడు.

అయినా ఆలోచనలు మాత్రం మేఘవర్ణం మీదనే!

బతికి చెడ్డమనిషి మేఘవర్ణం.

ఈ లోకంలో చెడిబతికిన వాళ్లుంటారు. బతికిచెడిన వాళ్లుంటారు. చెడి బతకడానికి కారణాలుంటాయి. ఆ కారణాలు కారణంగా ఒడిదుడుకులకు లోనుగాకుండా సాఫీగా బతికే వాళ్లుంటారు.

బతికిచెడిన వాళ్ళనుచూస్తే చెడిబతుకుతున్న వాళ్లకు ఎగతాళి!

ఆ ఊళ్లో చాలామందికి మేఘవర్ణాన్ని చూస్తే ఎగతాళి. కొంతమందికి జాలి. ఇంకొంత మందికి మునగచెట్టు మొనగాడని ఎకసక్కెం.

ఎగతాళి చేశారని ఎగిరిపడేది లేదు. జాలి పడ్డారని జారిపొయ్యేది లేదు. ఎకసక్కాలాడినారని ఏడ్చేది లేదు. చేస్తే కూలీనాలీ చేసుకుండేది. లేకుండాబోతే కాళ్ళెత్తి కడుపులో పెట్టుకొని గుడిసెలో పడుకుండేది.

బతికిచెడినచోట బతుకు కుక్కనీటిగతుకు రెండూ ఒక్కటే!

ఇంకొకరింకొకరైతే ఎప్పుడో కాలు పెరుక్కొని పారిపొయ్యేవాళ్లు. ఎక్కడో కానరాని దేశాల్లో ఇక్కడ పడే కష్టం అక్కడే పడేవాళ్లు. ఈ ఎత్తిపొడుపులు నెత్తి మొట్టుళ్లు లేకుండా కాలం నెట్టేసే వాళ్ళు. మేఘవర్ణం ఆపని చెయ్యలేకపోయాడు. ఎందువల్ల? అది ఈ మట్టిమీద మమకారం!

ఆ మాటకొస్తే తాను మాత్రం? ఆ పల్లెకొంపలో పడి ఎందుకుచస్తున్నాడు? పుట్లు పుట్లుగా పండుతుందాయని కాదు. గాదెలునిండుతుందాయని కాదు. ఆ మట్టిమీద మమకారాన్ని చంపుకోలేకనే!

అది అంతే! పుట్టినగడ్డ మీద మమకారాన్ని కొంతమంది అంత సులభంగా తెంపుకోలేరు. అది వాళ్ళ స్వభావం. ఈ మమకారాన్ని చంపుకోలేకనే కదా? మేఘవర్ణం ఆ ఊళ్లో పుట్టెడు కష్టాల్ని కుంయ్‌కంయ్ మనకుండా పడ్తా ఉండాడు!

అప్పుడు మిషన్ బావిగట్టుమీద నిలబడి ఉన్నాడు మేఘవర్ణం.

తనకోసరమే ఎదురుచూస్తున్నట్లుగా కరెంటు రావడంతో రంగనాథం ఆలోచనా స్రవంతి తెగిపోయింది.

కరెంటు రావడమంటే ఈ సీమలో రైతుకు నెత్తిన కనకవర్షమే కురిసినంత సంతోషం. ఆ సంతోషంతోనే రంగనాథం గబగబ మోటారు షెడ్డులోకి జొరబడ్డాడు. మీటనొక్కాడు. మోటారు తిరుగుతూ ఉంది.

పాతాళగంగ! పాతాళానికి వెళ్లినా నన్ను వదిలేటట్టుగాలేదే! అన్నట్టుగా గొట్టంద్వారా పైకి రాలేకవస్తూ ఉంది. రంగనాథం మడికయ్యకు మడవ తిప్పాడు. సాగలేక సాగుతున్న నీళ్లవైపు చూస్తుంటే కాలువకు ఇరుపక్కలా దట్టంగాపెరిగిన కసవుగట్రా కంటపడింది.

ఆకు మోవిన కసవు కాలువలో అడ్డంపడితే అరవై ఎకరాల పారుదల ఆగిపోతుందంట.

రంగనాథం గనిమమీద కూర్చున్నాడు. కాలువలో అడ్డదిడ్డంగా పెరిగిన తుంగాతుట్రా పీకేస్తున్నాడు. తుంగాతుట్రా అయితే అవతల పీకిపారేస్తున్నాడు కానీ తన మానసాకాశంలో మేఘాల్లా ముసురుకొంటున్న మేఘవర్ణం మీద ఆలోచనల్ని మాత్రం దూరం చేసుకోలేక పోతున్నాడు!...

అబ్బ చేసిన చేతలకు కొడుకు బందారాకు మోశాడంటారు.

నిజమేగదా? అబ్బ కోదండరామయ్య. కొడుకు మేఘవర్ణం.

ఆ అబ్బ కోదండరామయ్య చెప్పిన మాటలు పెడచెవిని పెట్టె. చెప్పుడుమాటలకు చెవి వొగ్గె. పంతాలకుపోయి పాటుపడె. ఇప్పుడు పలుబాట్లు పడుతున్నదెవరు? కొడుకు మేఘవర్ణం!

ఆ మాటకొస్తే కోదండరామయ్యేనా పాటుపడింది? ఆయన తమ్ముడు సీతారామయ్య? ఆ మొనగాడైతే పడరాని పాటుపడె. నువ్వా? నేనా? అంటా ఒకరికి మించి ఒకరు పంతాలకు పోతే? ఏంవయ్యింది? కురువంశానికి పట్టినగతే పట్టె. ఆ గతిపట్టే గదా? కోటికి పడగెత్తక పోయినా ఉన్నంతలో పదిమందికి కూడు పెడుతున్న కుటుంబం అల్లాకుపల్లాకాయె. అంతే గదా? చేసేది వొక్కరైతే అనుభవించేది ఇంకొకరు.

సరే! చేసినవాళ్లు చేసిరి. చేసినవాళ్లకు చేసినంత తప్పదు. వాళ్ళదోవన వాళ్లు పోయారు. ఉండేవాళ్లు? దిక్కూదరీ లేకుండా 'అలోరాంవచంద్రా! అంటా అల్లాడి చస్తా ఉండారు.

బోరా! పంతాలకు దిగితే తనామనలేదు. తండ్రీ బిడ్డలేదు. అన్నాతమ్ముడు లేదు. కడకు ఆలూమొగుడు కూడా లేదు. కత్తిగట్టిన కోళ్లే అవుతారు మనుషులు. రామ రామ! ఏం మనస్తత్వాలో ఏంపాడో?

ఎవుడైనా ఈ భూమిమింద చీలలు కొట్టుకొని స్థిరంగా ఉండపొయ్యేది లేదని తెలుసు. దోచినా దొంగలించినా చెంవటోడ్చినా చెయ్యరాని పనులు చేసినా కూడబెట్టిన డబ్బు కూడా రాదని తెలుసు. వస్తా వస్తా ఎత్తుకోనొచ్చింది లేదు. పోతా పోతా నెత్తిన బెట్టుకొని పోబొయ్యేది లేదు. ఈ మాత్రం తెలియదనా? ఈ కర్మభూమిలో ఎవుడిని కదిలించినా ఈ మాత్రం వేదాంతాన్ని ఇంకా చక్కగా వల్లిస్తాడు. వల్లిస్తూనే అన్ని తెలువులుగల మనిషి జంతువులకంటే అధ్వానం అయిపోతా ఉండాడు.

లేకుంటే సీతారాంవయ్య కోదండరాంవయ్య అన్నదమ్ముళ్ళా? ఆ మాటంటే... ఎవ్వరైనా వింటే నవ్విపోరా? ఒకరి తల్లోనాలికొకరు. ఒకరి ఆరోప్రాణం ఇంకొకరు గదా?

ఒకరి కష్టం తన కష్టం. ఒకరి అవసరం తన అవసరం. ఇది పల్లెల్లో తత్త్వం. ఇందమ్మా తీగూరంటే ఇందమ్మా పుల్లగూర అనడం పల్లెల్లో పరిపాటి. ఈ ఇచ్చిపుచ్చుకుండే తత్త్వమే లేకుండా పోతే పల్లెల్లో బతుకులు గడవడవంటే మాటలా? ఈ పూట ఒకరికి పారా పలుగు అవసరం. రేపు ఇంకొకరికి బానామోకో బండీ కదురుగోలో అవసరం. ఒకరి అవసరానికొకరు ఆదుకుండేది పల్లెబతుకుల్లో మామూలేగదా? ఎవురికైనా ఏదోవొక అవసరం వస్తుందనుకోండి. వస్తే వచ్చి కోదండరామయ్యను అడగతాడు. అడిగితే 'తమ్ముణ్ణి ఒక మాటడగాల గదబ్బా?' అంటాడు అన్న. అదే తమ్ముణ్ణి అడిగితే. 'అన్నను అడక్కుండా ఎట్టబ్బా?' అంటా గునుస్తాడు తమ్ముడు. అడిగిన మనిషి అవసరం తీరాలంటే అన్నాతమ్ముడు కలపలుక్కోవల్సిందేకదా?

అప్పుడెప్పుడో అన్న రాంవుడు ఆజ్ఞాపిస్తే కూడా తమ్ముడు లక్ష్మణుడు జవదాటినాడంట! వీళ్ల అట్టాగాదే?

అన్న గీతగీస్తే తమ్ముడుదాటేది లేదు. తమ్ముడికి చీంవచిటుక్కుమనిదంటే అన్నగుండె కలుక్కుమంటుంది.

అన్నకంట్లో నలుసు పడిందంటే తమ్ముడి గుండెలవిసిపోతాయి.

పంచె ఎగజెక్కి పనిలోకి దిగినారంటే పరువం మీదుండే జోడుకోడె లెందుకూ? మునం పట్టి ముందు పోతావుండే కూలోళ్లగతి కుక్కచావేగదా?

అయినా చేస్తా ఉండేది సంసారం కదా? ఎప్పుడో ఎక్కడో ఏదోవొక పొరబాటు వద్దన్నా జరుగుతుంది. తమ్ముడు ఎదరించిందీలేదు. అన్న అడిగిందీ లేదు!

ఇంతెందుకు? ఇప్పుడు మాదిర అప్పుడేంవన్నా మిషను గానుగలుండెనా పాడా? ఎద్దులగట్టి తిప్పాల్సిందేగదా? ఆ ఏడాది కట్టినకాడి విప్పకుండా చెరుకుగానుగ రెండు నెలలను తిరిగె. కలిసొచ్చే కాపురానికి ఏకాలు పెట్నా ఒక్కటే అంటారు. పంటా? విరగపండె. సరుకా?

సవరం వట్టాసరుకు. అరవై దెబ్బై గోనెల బెల్లం. ధర కూడా బ్రహ్మాండంగా పలికె. ఇంక బేరగాళ్లా? ఇంటిచుట్టూ పెళ్లచుట్టూ పోటీలు పడతా తిరిగిరి. 'అమ్మేద్దాంవన్నా!' అనె తమ్ముడు. 'వద్దుంబ్రా! ఇంకారేటెగ బడుతుందంట!' అని అన్న అనె. ఈ దినం ఎగబడుతుంది. రేపు ఎగబడుతుందని ఎదురుచూస్తా ఉంటే- ఎగబడకపోతే పీడపొయ్యింది. ఒక్కసారిగా పడి పొయ్యింది. ఆ రోజుల్లోనే అయిదువేలకు ధోకాలేదను కుంటా ఉంటే సగానికి సగం చేతికి రాలా. 'ఈ దెబ్బతో అన్నాతమ్ముడకి పడిందిరా?' అంటా కుశాలపడిరి ఊళ్లోవాళ్ళు. ఆడికి నిలవకుండా 'ఒరే సీతారాంవా! మీయన్న నీమాట ఇనకుండా పాయ. ఏదో సిన్నోడో పెద్దోడో ఎవుడో వొకడు సెప్తా ఉండాడుగదా? అని చెవులో వేసుకోవచ్చు గదా? ఒకటా రెండా? అష్టాబాపత్తుగా మూడువేలు గదరా?' అంటా నిలదీశారు కూడా!

అడిగితే సీతారాంవయ్య ఏంవనె? 'ఇట్టా మాదిరవుతుందని ఆయనేవన్నా కలగన్నాడా? అనుకునిదంతా అనుకున్నెట్టే జరగాలని ఎక్కడుండాది? ఆయననుకున్నెట్టే రేటు ఎగబడే ఉంటే?'- ఒక్క వెర్రినవ్వుతో కొట్టిపారేసె.

బెల్లం అమ్మినదుడ్లు ఇంట్లో ఉండె. ఊళ్లోవాళ్ల చూపంతా ఆదుడ్లమిందనే ఉండె. పల్లెకొంప గదా? అక్కరపడ్తే చేబదులు పుట్టుతుందని ఊళ్లో సన్నాబన్నాకు నమ్మకం. నమ్మకం నమ్మకంగా మిగిలె. ఆరాత్రి లక్షణంగా భోంచేసి పడుకొన్న కోదండరామయ్య తెల్లారేకుందికి అయిపులేదు.

ఇంకచూడు. 'బెల్లందుడ్లు సగానికి సగం చేతికిరాకుండా పొయ్యేకుందికి మణిసికి యాదన పట్టుకుణ్ణెట్టుండాది. ఏబాయో గుంటో చూసుకుణ్ణాడేంవో?'

ఊరుగొణిగె! తమ్ముడి గుండెలు ఉడికె!!

"ఇంతపనిచేస్తావనుకోలేదు గదన్నా? దుడ్లేంవుండాది? అది మనల్ని సంపాయించిందా? దాన్ని మనం సంపాయించినావా? ఇంకొక్క యేడాది ఊపిరి ఉగ్గబట్నాంవంటే యాభై అనింది నూరుగోనెలు పండించుకోలేంవా?" అని వాపోతా కాలు నిలిచిన చోట నిలవకుండా తిరిగె. వెతకని బావి గుంటా లేదంటా వెతికె. శాస్త్రాలు చూపించె. ఇర్లోళ్ల ఇరుగులమ్మతో గురిపెట్టించి అడిగె.

అన్నకు ప్రాణం భయం లేదంటే తమ్ముడు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని కూర్చుండె. తిండీతిప్పలు లేదు. ఏడుపు మానింది లేదు.

ఒక్క దినంగడిచె. రెండుదినాలు గడిచె. మూడు దినాలు గడిచె!

మనిషి అయిపు లేదు.

సీతారాంవుడి ఆగడం అంతాయింతా కాదు.

ఉరేసుకుంటానంటాడు. బావిలో దూకతానంటాడు. అటువంటి అన్నపోతే ఇంక బతుకెందుకంటాడు. అన్నకత ఏంవయిందో కానీ తమ్ముణ్ణి పట్టుకుండే దానికి వీలుగాలేదే?

కంటికి దూరంవయిన వాణ్ణి గురించి యేడ్చేదా? కంటిముందరుండే వాడి గోడుపడేదా? అని మల్లగుల్లాలు పడతాఉంటే అప్పుడొచ్చె కోదండరామయ్య కండ్లల్లో పాణం పెట్టుకొని.

అన్నను చూసి తమ్ముడు తమ్ముణ్ణి చూసి అన్న ఒకర్నొకరు కావిలించుకొని గుండెలవిసేటట్లు ఏడస్తా ఉంటే ఊరు ఊరే కండతడి పెట్టుకుండె.

"అదిగాదురా సీతారాంవా! కొంపలో దుడ్లుంటే ఎవరో ఒకరొచ్చి అడగనే అడగతారు. పెట్టుకోని లేదనేదాని కవుతుందా? ఎట్టా ఈనెల్లో కాకుండా పొయ్‌నా పైనెల ఆపైనెల్లో అయినా ఇంట్లో సుబకార్నెం పెట్టుకోవాల్సిందే కదా? బంగారు కొనుక్కోనొస్తావని వేలూరికి పోతి. వాళ్లతో వీళ్లతో అంటే మనిషికొకమాట అడ్డంమాట్లాడ్తా ఉంటారు. ఎందుకులే? అని ఎవురితో అనకుండా పోతి. పోతే కుక్కసంతకు పొయ్‌నకతాయె గదరా నాబతుకు తమ్ముడా!" అంటా బోరోమని యేడ్చె.

తమ్ముడు "ఏంవయిందన్నా?" అని అడిగితే–

"ఏంవని చెప్పమంటావురా నాబంగారి తమ్ముడా? ఏమూదేవి నన్ను పూనిందో ఆ దేముడికే ఎరిక. షాపులో కూసోని సంచిపక్కన బెట్టుకొని మాట్లాడ్తానే ఉండా. మట్లాడ్తా మాడ్లాడ్తా తిరిగి చూసేకుందికి సంచిలేదే? కంట్లో పాపను కత్తరించినట్టు నాయాలెవుడో కొట్టేసెనే! ఇంక ఏడిస్తే ఏంజేసేది? మొత్తుకుంటే ఏంజేసేది! ఊరుగాని ఊళ్లో ఎవుర్తో చెప్పుకుందు నాగోడు? చెప్పినా వినిపించుకొనే నాధుడెవుడు? తిండీతిప్పలు లేకుండా ఒకటా? రెండా? యాబైమైళ్ళు నడక. పాణాల్తో కొంపచేర్తే చాలనుకుంటిరా నా తండ్రీ!" అంటా తమ్ముణ్ణి కావిలించుకొని యేడ్చె.

"ఎవుడో నా కొడుకు పుట్టి తీరస్తాడులే! రెండు వేలేంది? నువ్వు ఇల్లుచేరిందే పదివేలు. నువ్వు బాదపడవద్దన్నా!" అంటా తమ్ముడు అన్నను ఓదార్చె.

ఈ దెబ్బతో అన్నాదమ్ముళ్లు ఎవురిచట్టి వాళ్లెత్తుకుంటారని ఉలికులికి పడిన ఆ ఊరు ముక్కుమింద వేలేసుకుండె!

ఇట్లా ఆ అన్నదమ్ముళ్ల వద్దికను గురించి చెప్పుకోవాలంటే ఒకటా? రెండా?

వాళ్ళను గురించి అప్పుడు చెప్పుకొన్నారు. ఇప్పుడు చెప్పుకొంటున్నారు. అప్పుడు వాళ్ళ కలుపుగోలుతనం గురించి... ఇప్పుడు పంతాలకుదిగి పాడైపోయిన సంగతి కథలుగా చెప్పుకుంటా ఉండారు. చెప్పుకోకుండా ఏంజేస్తారు? దాదాపు పదెకరాలనంజ ఇరవై ఎకరాల పుంజ ఉండే నగానట్రా అన్నదమ్ముళ్ల పంతాలకు హారతి కర్పూరమైపోతే?

సీతపుట్టె. లంకచెడె! – అంటారు.

ఆ కొంపలో చిన్నకోడలు కాలుపెట్టె. ఆకొంప మూడారుదోవలాయె.

అది అంతే! గాటికిగొడ్డు. దొంతికి కడవ. ఇంటికి ఇల్లాలు వచ్చిన వేళావిశేషం!...

గనిమ మీద కూర్చొని కాలువలో అడ్డదిడ్డంగా పెరిగిన ఆకూ అలుముల పెరుక్కొంటూ రంగానాథం మెల్లగా ముందుకు జరుగుతున్నాడు. జరుగుతూ ఆలోచిస్తున్నాడు. ఆలోచన అంతశ్చేతనం. చేస్తున్న పని బాహ్య చేతనం. అంతర్ బాహ్యచేతనాలకు అంతగా సంబంధం

లేనట్లుంది. అలవాటైన పనులకు ఆలోచనలు కూడా అడ్డురావేమో? అందుకే రెండు పనులు యాంత్రికంగా జరిగిపోతున్నాయి. అది ఒక విచిత్రమైన స్థితి. ఆ స్థితిలో మనిషి బాహ్య దృష్టి కేవలం నామ మాత్రమే! కాకపోతే కరెంటు పోయింది. మోటారు నిలిచిపోయింది. ఎడకాలువ వచ్చింది. పొద్దుబాగా వాలిపోయింది. అయినా రంగనాథం గమనించే స్థితిలో లేడు.

రైతుకు జీవనాధారం పైరు. ఆ పైరుకు ప్రాణాధారం నీళ్లు. ఆ నీళ్లే ఎడకాలువ వచ్చేసరికి రంగనాథంలో రైతు ఉలిక్కిపడి మేలుకొన్నాడు. రంగనాథం ఎగిరిపడి పైకిలేచాడు. వడివడిగా బావి దగ్గరికి నడిచాడు. నిలిచిపోయిన మోటారువైపు... బావిలో అడుగంటుతున్న నీళ్ళవైపు దీనంగాచూస్తూ 'ఇంక పీనిగకాడ కావలికాచినట్టే బతుకు. ఈ కరెంటు ఎప్పుడొస్తుందో? ఏంపాడో?' అని నిట్టూరుస్తూ బావి గట్టున కూలబడ్డాడు!

కాలువలో నీళ్లు సాగదానికి మోటర్ లేకుంటే కరెంటు మోటార్. ఏదో ఒకటి అవసరం. మనిషిలో ఆలోచనలు కొనసాగడానికి ప్రేరణ అవసరం. రంగనాథానికి ప్రేరణ మేఘవర్ణం. బావి గట్టున కూర్చున్న రంగనాథ మనసు మళ్లీ గతంలోకి దారితీసింది!

కడవదు పాలను చెడగొట్టడానికి ఒక్క ఉప్పుగల్లుచాలు. పాలు పొంగతా ఉణ్ణెట్టు పొంగతాఉండే సంసారాల్ను చదరం చేసేదానికి ఒక్కమనిషి మాటచాలు. అట్లానేగదా కోదండ రామయ్య కొంప కొళ్ళపొయ్యింది.

ఆ ఇంటికి చిన్నకోడలు రానన్నావచ్చె. వచ్చిన వేళావిశేషంవో? వచ్చిన మనిషి పెడసరం వో? ఒకరికెదురుగా వొకరు నిలబడి ఎరగని అన్నదమ్ముళ్లు ఎదురెదురుగా నిలబడేదేంది? నువ్వెంతంటే? నువ్వెంతనే కాడికి ఎదిగి పొయ్యేదేంది?

అదే చోద్యం! కడవడంత గుమ్మడికాయ గూడా కత్తిపీటకు లోకువైనట్టు వాడెటువంటి మొగోడైనా ఆడది ఆడమన్నెట్టు ఆడతాడే? ఆడాల్సిందే! అయినా ఆలోచన సాలోచన లేకుండానా?

అసలు ఆడదాని మనసులో అనుమానం పుట్టకూడదు. పుట్టిందా? అది పెనుభూత మవుతుంది. చిన్న కోడలి మనసులో అట్టా అనుమానంవే పుట్టె. అది కొంపకే ఎసురు పెట్టె.

తమ్ముడు అన్నమాట జవదాటడు. వదినెమ్మ అడుగులకు మడుగులొత్తుతాడు. అది ఆ ఇంటి మట్టసం. అదే మంట చిన్నకోడలికి!

"ఇదేందిది! వింతల్లో మరీ వింతగా ఉండాదే? ఈ ఇంటికి తాను పెద్దకోడలే కావచ్చు. అయినంత మాత్రాన నా మొగుణ్ణి కొంగులో కట్టుకొని తిరిగే అతికారం ఆపెకెవురిచ్చినారు. అయినా ఈ మనిషి కూడా వగాతగాలేని అదేం మొగోడమ్మా! పడకమిందపడుకోనుండనీ! పంచమిందకూర్చోనుండనీ! వదినెమ్మ పిలుపో అన్నగారి ఎలుగో చెవుల్లో పడ్తే చాలు. ఎగిరి పడిలేస్తాదు. ఆమిందట అరక్షణం. పట్టుకుంటే గూడా నిలవడే? ఆడెవుడో అబ్బరంగా బిడ్డ పుట్టాడని గెడ్డపారెత్తుకుణ్ణాడంట చెవులు కుట్టేదానికి? అట్టుండాదే కత. ఈ ఇంటికత బలేకతగా ఉండాది. ఇప్పుడే అంతు తేల్చుకోకుండా పోతే వెనకటికి అగచాట్లు కొని తెచ్చుకుణ్ణెట్టే!"

ఇంటికి చిన్న కోడలైనా చాలా దీర్ఘంగా ఇంకా లోతుగా ఆలోచించె. సమయం సందర్భం కోసరం ఎదురుచూసె. కలిసొచ్చినపుడు-

"మీయన్నకు వదినెకు నువ్వు కాపురంచేస్తా ఉండావుగదా? నడిమద్దె నన్నెందుకు తెచ్చుకుణ్ణావ్ పానకంలో పుడకమాదిరి!" అని మొగుణ్ణి అడగనే అడిగె.

"ఒసేబదవా? నీ ఆడబుద్ధి పోనిచ్చినావు గాదుగదే?" అంటా సీతారామయ్య నవ్వేసే కుందికి దాని అహం దెబ్బతినె.

ఆడదాని అహం దెబ్బతింటే ఇంక చెప్పాల్నా? అక్కడే పుట్టె పుండు.

పుట్టినపుండు సలపకుండా ఉంటుందా?

అట్టాయిట్టా చూసి ఒక దినం తోడుకోడల్నే నిలదీసె.

"అక్కా! అక్కా! నేనూ చూస్తా ఉండా. ఇట్లాంటి అన్నాతమ్ముడు ఈ బూలోకంలో వెతికినా దొరకరు కదక్కా?" అనె.

"చిన్నంగా అంటావా ఆ మాట చెల్లెమ్మా? అదేగదా ఈ ఊళ్లోవాళ్ల కడుపుమంట గూడా. తల్లికడుపులో నుంచి పుట్నెప్పుడు మాత్రంవే వాళ్లు తనితనిగా పుట్నారేవో? కానీ వాళ్లిద్దరిదీ ఒకేమాట. ఒకే పలుకు. ఒకే కంచం. ఒక మంచంగా కదమ్మా చిన్నప్పట్నుంచి బతికినారు!".

"ఒకకంచం ఒక మంచం మాదిర్తో నువ్వు ఆ అన్నదమ్ముళ్ళకిద్దరికీ వొకదాని వయ్యుంటే బాగుండుకదక్కా?"

"ఏం వన్నావే? ఇంకొక్కసారను."

"ఒక్కసారి కాదు. వందసార్లంటాను. ఉండేమాటంటే ఉలుకెందుకు?"

వందసార్లంటానని మాటవరసకు అనిందేంవో అనిందికానీ- అనింది ఒక్కసారే! ఆ ఒక్క మాటతోనే కోదండరామయ్య కొంపకుపట్టె శని!

ఆ రాత్రి ఇంటికి పెద్ద కోడలు ఆ మాట మొగుడితో చెప్పుకొని కుళ్ళికుళ్ళి ఏడ్చె. బిడ్డను గిల్లిపెట్టి తొట్టిని ఊపినట్టుగా పెట్టాల్సినచోట పెట్టేసి చిన్నకోడలు బుట్టలో పాము మాదిర పడుకుండె.

ఆ మరుసటి రోజు రాత్రి. ఊరుమాటు మణిగినవేళ. అన్న తమ్ముణ్ణి పిలిచె. అర(గది) తలుపుమూసి గెడిపెట్టె. ఎదురుగా కూర్చోబెట్టుకునె.

అన్న ఏం చేస్తా ఉండాడో తమ్ముడికి అర్థంకాకుండా అయోమయంగా చూస్తాఉంటే?-

"ఒరే సీతారాంవా! మనిద్దురు ఒక తల్లికడుపులో పుట్నాం. మనకొచ్చినోళ్ళు?"

"ఏందన్నా నువ్వు మాట్లాడ్తా ఉండేది?"

"నా మాటమింద నీకు గురుంటే నేను చెప్పినట్టు విను."

"నీ మాట ఎప్పుడు విన్లేదని?"

"ఇప్పిటిదాకా వినిందికాదు. ఇంకమిందట కత నేనుచెప్తా ఉండేది."

"అట్నే నీ యిష్టం చెప్పన్నా!"

"మనకొచ్చినోళ్లవల్ల మనం జుట్టుజుట్టు పట్టుకోకముందే తెలివిగా ఎవుడెవుడి కుండాచట్టి వాడెత్తుకుండేది మంచిదిరా!"

"ఇప్పుడేవయిందన్నా?"

"ఆ వివరాలు నన్నడగబాక. నా మాట కెదురాడబాక. ఇప్పటిదాకా గుట్టుగా బతికిన సంసారాన్నెత్తి వీదిలో వెయ్యబాక. నీయన్న నీ కంటి ముందరుండాలంటే నేన్జెప్పినట్టు విను."

"అన్నా!"

"దున్నపోతైపుట్టే దున్నిచావాల్సిందే! అన్నదమ్ముళ్లయి పుట్టే వేర్లు పోవాల్సిందే!"

"ఈ మాటనేదానికంటే నీ చేతుల్తోనే అంత విషమిచ్చుంటే ఒక్కనాటితో ఈ పీడ విరగడై పొయ్యుండుగదన్నా?"

"ఒరే సీతారాంవా?"

"ఇంకొక్క మాటనకుండా ఆ పని చెయ్యన్నా!"

"ఈ మాటంటా ఉంటే నా కడుపెట్టా రగల్తా ఉందాదో? నా గుండెలెట్టా మండతా ఉండాయో? అర్తంకాదురా. ఎవురికీ అర్తం కాదురా."

అన్నాదమ్ముళ్లు వొకర్నొకరు కావిలించుకొన్నారు. భొరోమని ఏడ్చుకొన్నారు. ఏడ్చినా మొత్తుకొన్నా ఏంవాయె?

తెల్లారేకుందికి ఆ కొంప రెండు దోవలాయె.

ఊరు నమ్మలేనట్లుగా చూసె!

కర్నానికి కంటిలో పుల్లబెట్టి నట్లాయె!!

మునసబుకు మూతిమింద కొట్టినట్లాయె!!!

ఇంక ఊళ్లో పెద్ద మనుషులా! భాగపరిష్కారాల్లో తలదూర్చి కూడూ కూరగా తినమరిగిన కోళ్లు రెక్కలు తట్టె. ఎందుకు తట్టరు? భాగపరిష్కారం పేరుతో కూర్చుంటే ఒక్కమాటతో తెగనిస్తారా? రెండు పక్కలా గుంజుకోవాల్సినంత గుంజుకుండేదాకా వీళ్లెక్కడ పడనిస్తారు? పరిష్కారం కానిస్తారు?

ఊళ్లో అటువంటి అవకాశం కోసరంవే ఎదురుచూస్తా ఉండే నాయాండ్లు? ఆ అవకాశం అనుకోనట్టుగా జారిపోతే?

జారిపోయిందని నోళ్ళుమూసుకోవడం ఊరిస్వభావం కాదుగదా?

"ఒరే నాయాండ్లాలా? ఎంతకాడికొచ్చి నార్రా! ఇంతమంది పాలన్నంతినే పెద్ద మనుషులు ఊళ్లో ఉండంగా మీ పాటికి మీరే మొగోళ్లయి పోతిరి గదరా? జరగనీ... జరగనీ! ఎంతకాలం జరిగితిందో జరగనీ! ఏనాటికో ఒక నాటికి మాకాళ్లకాడికి రాకుండా పోతారా? మేంవు చూడకుండా బోతాంవా?" అంటా ఎదురుచూస్తా ఉండిరి.

అంతమందిని ఎదురుచూస్తా కూర్చోమనేది అంతమంచిది కాదనుకున్నారా రేంవో ఆ అన్నా తమ్ముడు. ఎక్కిరే. కోర్టు కెక్కిరే. నాసాంవిరంగా! అదిగూడా ఎడాది తిరగకముందే. కోర్టు కెక్కిన కొంప కొళ్లబోతుందని తెలిసిగూడా!

ఆ దెబ్బతో వెదజల్లితే ఏరుకొని తినేనాయాండ్లు ఎగిరెగిరిపడిరే!

రాంవ! రాంవ! నోరు విప్పి చెప్పుకోవాలంటేనే సిగ్గుచేటు. ఉప్పుకు పనికొస్తుందా? ఊరుగాయకు వాడుగుతుందా? అంత పనికిమాలిన దానికి ఎంత తెలివి మాలినోళ్ళయినా కోర్టుకెక్కతారా? ఎక్కకేం చేస్తార్లే? ఊరంతా ఎక్కబెట్టి వేడుకచూసే నాయాండ్లే అయితే?

"నాతమ్ముడు! నాతమ్ముడు! ఏడేడులోకాల్లో దివిటీపెట్టి ఎతికినా దొరకతాడాఅటువంటి తమ్ముడంటా ఊరేగతా ఉంటివే? ఇప్పుడేంవాయె? పనికి మాలిన దానికే పంతానికి దిగలా? అదమణిసి ఎక్కబెట్టే మాత్రం? దానికీ నాయం. అన్నాయం లేదా? నోట్లో నాలిక లేదనుకున్నోడే తిరగేసి మల్లేసి మాట్లాడ్తా ఉంటే నీకేనా శాతకాన్ది? ఇద్దో కోదండరాంవయ్యా? ముందుగానే సెప్తాఉండాం. నూరుఆరుగానీ ఆరునూరుగానీ ఎనిక్కాస్తివో ఇంకమిందట ఈఊళ్లో తలెత్తుకోని తిరగాల్సిన పనేలే."

కోదండరామయ్య పార్టీ కోదండరామయ్యను ఎక్కబెట్టె.

"ఒరే సీతారాంవా? నెత్తిన నోరుబెట్టుకోని మొత్తుకుంటే నీకు సెవుల్లో పడిందా? అటువంటి అన్నను సంపాయించుకుంటావా? అంటా నీలిగితివే? నీలిగి నీలిగి ఇప్పుడు మూలగతా ఉండావు. ఆదెంత? పోనీలే. రగతం పంచుకోనిపుట్నోడే గదా! అని అనుకోవచ్చుగదా? అనుకున్నాడా? లేదే? జ్యేష్టబాగం పెట్టుకోలా? అటుమంటప్పుడు నువ్వు మాత్రం ఎందుకొదులుకోవాల? వాడొకడేనా మీయబ్బకు పుట్టింది? ఇప్పుడుగానీ పోనీలే? అని వొదులుకుంటివో ఇట్టా మాదిర్నే వొకొక్కటిగా వొదులు కోవాల్సొస్తుంది. ఆ మిందట నీయబ్బతోడు."

వగచినట్టే సీతారాంవయ్యను ఎక్కబెట్టేవాళ్లు ఎక్కబెట్టిరి. కోదండరామయ్య వెళ్ళి కర్నం పంచన చేరె. అదివిని మునసబు మంచిగా సీతారాంవయ్యను పిలిపించుకుండె.

మునగచెట్టు ఎక్కించడంలో ఒకర్ని తీసెయ్యాల్సిన పనిలే. ఇంకొకర్ని తోసెయ్యాల్సిన పనిలే. ఇద్దరు మొనగాళ్లే! అయితే ఎక్కేవాళ్లకు మాత్రం అది మునగచెట్టని తెలియదు. అదే వాళ్ల పనితనం!

అన్నాతమ్ముడు అటువంటి వాళ్లచేతుల్లో పాయ్‌పడిరి. పడ్డే లేచి నిలబడిందెక్కడ? కోర్టులోనే గదా?

కర్నం కోదండరామయ్య కొక వకీల్ను పెట్టె. వాడెటుమంటోడు. కట్టెల్లో కంపల్లో కూడా కాలడంట. వాడి పేరే మొండివకీలు. తలకేస్తే మొలకు. మొలకేస్తే తలకు. పట్టుకుంటే వొక్కరాగాన వదలిపెట్టే పనేలేదంట!

"అయితే ఇంకెట్టబ్బా? అంటా సీతారాంవుడు నీళ్లుగారిపోతే మునసబు. "ఒరే ఎరిముండా! నువ్వుండ్రా. మనం నాలుగు చేతుల వకీల్ను పెట్టుకుందాం!" అనె. అన్నంత పనిచేసె.

ఆ వకీలు కోడిగుడ్డులో ఈకెలు పెరికే నాయాలంట!

ఒకదు మొండోదు. ఇంకొకదు కోడిగుడ్డులో ఈకెలు పెరికే పలాతన్. ఒకర్నిమించినోళ్లు ఒకరు. ఇద్దరు మోటుకున్నారు.

వాయిదామింద వాయిదా. వాయిదా వాయిదాకు అన్నపక్క సాక్షులు. తమ్ముడి పక్క సాక్షులు. కపినాయకులు కర్నం మునసబు. ఊళ్లోనుండి బయల్దేరితే పండక్కో పబ్బానికో బయల్దేరినట్టే గదా? కోర్టు కాడికి పొయ్యేది. పొద్దు తిరిగేదాక ఆ చెట్లకింద పడిగాపులు కాసేది. అప్పుడు వాయిదా పడిందంటే చెవులు వాలేసుకొని కొంపలకు తిరుక్కోనొచ్చేది.

ఒక్క వాయిదాకు వచ్చి పోవాలంటే అయ్యే గొరుగుడు? సారాయి తాగిపించే వాళ్లకు తాగిపించాల. తినిపించేవాళ్లకు తినిపించాల. పై ఖర్చుల కంటే చేతికి దుడ్లివ్వాల. అన్నాతమ్ముడు పోటీలు పడ్డాపెట్టిరి. ఎంతకాలంవని పెట్టారు. చేతిలో చిలుంఉండేదాకా? అమిందట? ఉందారు గదా ఊళ్లోవాళ్లు అదేపనిగా కాచుకొని! నోరుతెర్సి... అడిగిందే చాలని అప్పులిచ్చేదానికి. వాళ్లు ఇవ్వగలిగినంత ఇచ్చిరి. వీళ్లు చెయ్యగలిగినంత అప్పు చేసిరి. చేతిలో ఉండిన నగా నట్రా ఒకటికి సగంగా అమ్మేసిరి. తినని వాడు పాపాత్ముడన్నెట్టుగా తినబెట్టిరి. తిరిగిరి తిరిగిరి పనీపాట వదులుకొని తిరిగిరి. ఒక సంవత్సరవా? రెండు సంవత్సరాలా? మూడేండ్లు తిరిగిరి ఇంటికి కోర్టుకు. ఎందుకు? పనికిరాని చెట్టు. కత్తితోకొట్టే పొయ్యిలోకి రంపంతో కోస్తే వాకపనిముట్టుకు వాదగదే? మునగచెట్టు. అటువంటి పనికి మాల్నె చెట్టు అన్నకా? తమ్ముడికా? తేల్చుకుందాంవని తిరిగిరే! అయినా ఆ కోర్టుగూడా వీళ్లు సుద్దంగా మునిగి పొయ్యేదాకా తేల్చి చెప్పిందా? లేదే? మూడేండ్లు తనచుట్టూ తిప్పించుకుండె. కమిషనర్ను పంపించె. సర్వేయర్ను పంపించె. సాక్షుల్ని విచారించె. వకీళ్లకీచులాట నవ్వుకుంటా వినె. మూడేండ్ల పొదగనా వినె. అప్పుడు చెప్పె తీర్పు ఆ మునగచెట్టు అన్నకే చెందుతుందని!

అన్న మీసంమింద చెయ్యేసె. తమ్ముడు తలొంచె!

అక్కడికైనా కథ కంచికి పొయ్యుంటే బాగుండు. పోలేదే?

"ఇప్పుడు నలుగుర్లో తలెత్తుకొని తిరిగేదెట్టని ఆలోచించకుండా మునుగేసుకోని మూలకూర్చుంటే ఏంవొస్తింది? ఆ పొద్దు అన్నాతమ్ముడు బాగపరిష్కారం చేసుకున్నారుగదా? మాటాపలుకేగానీ రాత కోతలుందాయా? లేదుగదా? ఇప్పుడు మీయన్న బాగం నువ్వు పెట్టుకో. నీ బాగం మీయన్న కిచ్చేయ్. మునగచెట్టు మనకెట్లారాదో చూద్దాం?"

చిన్నకోడలు మొగుడికి తెలివిగా పురెక్కించె!

అంతగొప్ప ఆలోచన తనకు రాకుండా పోతే పొయ్యింది. అన్ని దుడ్లు మింగేసిన వకీలుకు రాలా? గుడ్లుకోళ్లుగా మింగేసిన మునసబుకు రాలా? తమ్ముడికి వొళ్లుమండె. ఆమంట చల్లారేదాకా వకీల్ను మునసబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టె. ఆమిందట పెండ్లాం తెలివిని పొగిడె. ముసుగేసిన పైగుడ్డను తీసి ముంపుగా తలగుడ్డచుట్టె. అదేమాట అన్నను అడిగించె.

అన్న అదెట్టా కుదురుతుందనె!

'అయితే కుదిరేచోట్నే కుదిరించుకుందాంవులే!' అనె తమ్ముడు.

అన్నాతమ్ముడు భాగపరిష్కారం కోసరంవని మల్లా కోర్టు కెక్కిరే. అదిగూడా కోర్టులో భాగపరిష్కారం అయ్యేదాకా కయ్యల్లో ఎవురూ మడకలు కట్టరాదని వొప్పందం చేసుకొని కదా కోర్టుకెక్కిరి?

గిచ్చి జగడానికి పిలిచిందంటారే? ఇట్నేగదా? లేకుండాపోతే ఆ పొద్దు కూలోళ్లొచ్చినారని పెద్దకోడలు మునగచెట్లో ఒక కాయలేకుండా కాయలన్నీ కోసుకుందేదేంది? ఆపూటే చుట్టాలొచ్చినారని చిన్నకోడలు ఆకాయలు తనకే కావాలనేదేంది? దాంతో పంతాలకు పొయ్యేదేంది? ఆ పంతం నువ్వెంతంటే? నువ్వెంత కాడి కొచ్చేదేంది? జుట్లు పట్టించేదేంది? చిన్నకోడలు మొగుణ్ణి 'నీయబ్బకు నువ్వు పుట్లేదా?' అని అడిగేదేంది? ఆ మొగోడు మొలగుడ్డ ఎగచెక్కేదేంది?

తోడు కోడండ్ల జుట్టు విడిపించేదానికి అన్నదమ్ముళ్లు కోర్టుకెక్కిరి.

భాగపరిష్కారం కేసు కోర్టులో అయిదేండ్లు నడిచె. ఈ అయిదేండ్లలో బంగారు పండతా ఉండిన భూముల్లో తొండలు గుడ్లు పెట్టె. ఆదాయంవా? పొద్దస్తమానం పోరకలాడ్తేనే ఆడికాడికి. పంతాలకు పొయ్ కయ్యల్లో మడకే కట్టకుంటే? ఇంక అప్పొ? వడ్డికిమింగి తలకు మించె. అప్పుడు కోర్టు దయతలిచి 'మీమీ భాగలైనా అమ్మేసి అప్పు కట్టుకోండి! అన్నట్టుగా అన్నభాగం అన్నకే తమ్ముడి భాగం తమ్ముడికే!' అని తీర్పుచెప్పె.

ఒళ్ళు తెలియకుండా చేసిన అప్పు వడ్డీ మొదుల్తో పెరిగె. ఈ ఏడెనిమిదేండ్లలో హనుమంతుడి తోకమాదిర్తో పెరిగె. తీర్చేకుందికి సెంటు భూమి మిగలకుండా చిప్పచేతికొచ్చె.

ఇంక పూటగడిచేది?– చిప్పెత్తుకొని అడక్కతినాల్సిందే గదా?

అడక్కతినాలంటే? అభిమానం? పువ్వులమ్మిన చోటనే కట్టెలమ్మడం? ఎవురికైనా తగనిపనేకదా? అందుకే ఎక్కడి పదిమంది కూలోళ్ళను పెట్టి పనీపాట చెయ్యించినారో అక్కడే అన్నాతమ్ముడు కూలికి పోవాల్సివచ్చె.

తలుచుకుంటే కడుపు చెరువవుతుంది? అది వాళ్లబావి. అప్పుడు కాదు. బాగా బతికినప్పుడు. ఆ బావి అడుగంటిపోతే పూడెత్తేదానికి అన్నాతమ్ముడు ఇద్దరు కూలికి పొయ్‌నారు. కొంపకొల్లబొయ్‌నాక వాళ్లిద్దరు ఒకరి మొగం ఒకరు చూసుకునింది అక్కడే! అన్నచేతిలో తట్ట. తమ్ముడి చేతిలోకి మారాల. తట్టమారేటప్పుడు చూపులు చూపులు కలిసె. అన్నచేతులు వణికె. తట్టజారె. కాలిమిందపడె. 'అమ్మా!' అనె అన్న. 'అన్నా!' అనె తమ్ముడు. అమ్మా! అన్నా! అన్న రెండు శబ్దాలు కలగలిసి విడిపొయ్‌న బతుకుల్ని వెక్కిరించె. అమ్మ అన్న... అయ్య– ఈ పదాలన్నీ ఆపదలప్పుడే గుర్తుకొచ్చేటట్టుగా ఉండాది.

బొరా! మునగచెట్టా? ఎంత పనిచేసె!

పోనీ! ఆ మునగచెట్టయినా దక్కిందా అంటే? ఆ మధ్యాహ్నం కోర్టు తీర్పుచెప్పె. అబ్బ! ఇంతకాలానికి ఊళ్లో గాలీవానా వెలిసిందనుకుంటా ఉంటే ఆ రాత్రి నిజంగానే పెద్దగాలీ వానా వచ్చె.

మునగచెట్టు! పూతాపిందెమిందున్న మునగచెట్టు మొదలంట విరిగి కుప్పకూలె!

ద్వాపరయుగంలో సూది మొన మోపినంత చోటు! కలియుగంలో మునగచెట్టు! తలపగల గొట్టుకుండే దానికి ఏ రాయి అయితే ఏంవన్నట్టు ఏదైతేఏమి కొంపలు కూల్చేదానికి?

యుగాలు మారినా మారనిది మనిషి తత్త్వమే!...

కన్నీకటిపడుతున్న వేళ. ఒంటరిగా బావిగట్టున కూలబడి కరెంటు కోసరం ఎదురుచూస్తున్న రంగనాథం... భారంగా నిట్టూర్చాడు– మునక్కాయ ముక్కల్ని చూసి వలవలా ఏడ్చిన మేఘవర్ణం కనులముందు మెదులుతూ ఉంటే! ●

ఉదయం
(22, ఫిబ్రవరి 1991)